## క్లుప్తంగా

### రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం



ఇంజరాపు మోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నిస్వార్థ సేవకుడు డాక్టర్ ఇంజరాపు మోహనరావు అని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లికి చెందిన మోహన్‌రావు జన్మదినం సందర్భంగా శనివారం రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం రక్తదాతలను సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, బత్తిలి రమేష్, బొద్దాన వెంకటేష్, ఎం.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల: మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం లావేరు మండలం గోవిందపురం, అదపాక గ్రామాల్లో వెలుగు సిబ్బంది చేపట్టిన వనం–మనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఇజ్జాడ శ్రీను, వెలుగు ఏపీఎం సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అనురాధ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు, సాంకేతిక అంశాలపై పట్టు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ అన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సెమినార్ 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ ఇష్యూస్–చాలెంజస్, స్ట్రాటజీస్' శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ కూన అచ్యుతరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎస్.సంతోష్ రంగనాథ్, డి.చక్రపాణి, టి.భవాని పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ నేత ఔదార్యం



కృష్ణవేణికి నగదు అందిస్తున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: మండలంలోని దవళపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి ఓ వృద్ధురాలికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన నిరుపేద పేడాడ కృష్ణవేణి భర్త గత ఏడాది డిసెంబర్‌లో మృతి చెందారు. సాంకేతిక లోపం వల్ల ఆమెకు పింఛన్ మంజూరు కాకపోవడంతో శ్రీరామమూర్తి స్పందించి ప్రతి నెలా మూడు వేలు రూపాయలు అందిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.4 వేలకు పింఛన్ పెంచడంతో శ్రీరామమూర్తి కూడా వృద్ధురాలికి రూ.4 వేల అందజేస్తున్నారు.

### మహానందీశ్వరునికి అభిషేకాలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో శనిత్రయోదశి సందర్భంగా మహానందీశ్వరునికి ప్రదోషకాల అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడు, ఉమారుద్రకోటేశ్వర స్వాములకు ఏకకాలంలో హారతులు ఇచ్చారు.

## రెండు దశాబ్దాలుగా..
# ఆధ్యాత్మిక సేవ



సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న లలితా సంఘం

- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో శ్రీలలితా సంఘం
- ఫోన్ చేస్తే చాలు ఉచితంగా సేవలు
- ఇప్పటికే 1500 గృహాల్లో లలితా సహస్ర నామ పూజలు, పారాయణలు

శ్రీకాకుళం కల్చరల్ : హిందూ సంప్రదాయంలో పూజా విధానం కీలకం. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భావి తరాలకు అందించాలంటే పూజా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి. ఈ మహోన్నతమైన ఆధ్యాత్మిక సేవను శ్రీకాకుళం నగరానికి చెందిన శ్రీలలితా సంఘం రెండు దశాబ్దాలుగా కొనసాగిస్తోంది. ఇప్పిలి వీధిలో ముగ్గురు మహిళలు కలిసి 2002లో శ్రీలలితా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇంతింతై అన్నట్లుగా ప్రస్తుతం 120 మంది శాశ్వత సభ్యులు చేరారు. వీరంతా ప్రతి శుక్రవారం శ్రీలలితా దేవి పూజలు, పారాయణలు వారానికి ఒకరి ఇంట్లో ఉచితంగా నిర్వహిస్తారు.

**సంఘం నిర్వహించే పూజలివే..**

అమ్మవారికి శ్రీసూక్తవిధానంలో షోడశోపచార పూజలు చేస్తారు. శ్రీలలితా సహస్రనామ పారాయణ సామూహికంగా చదువుతారు. అష్టాదశ శక్తి పీఠాలను స్తుతించడం, అమ్మవారి 300 నామాలను స్తుతిస్తూ ఖడ్గమాల పారాయణ, అష్టలక్ష్మీదేవి స్తుతి, ఒక్కొక్క శ్లోకంతో రామాయణ, భారత, భాగవత, గీతలను పారాయణ చేయడం, లింగాష్టక పారాయణ, హనుమాన్ చాలీసా, మృత్యుంజయ మంత్ర జపం, శ్రీలలితా స్తోత్రపారాయణ ఫలితాన్ని తెలియచేయడం, అమ్మవారి దయ అందరికీ ఉండాలని కోరుతూ శాంతిమంత్రం చదువుతూ పూజలు ముగిస్తారు. ఈ కార్యక్రమమంతా రోజులో మూడు గంటల పాటు కొనసాగుతుంది.



పూజా మందిరంలో ఏర్పాటు చేసిన చిత్రపటం

**ఇతర ప్రాంతాలకు సైతం..**

వీరు ఎవరింటికైనా వచ్చి పూజ చేస్తారు. అయితే రెండు వారాల ముందు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రత్యేక రోజుల్లో లక్ష పుష్పార్చనలు, సామూహిక కుంకుమపూజలు నిర్వహిస్తుంటారు. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా వెళ్లి శుక్రవార పూజలు చేస్తుంటారు. టెక్కలిలోని రావివలస, విశాఖ, ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్, భువనేశ్వర్, పార్వతీపురం, విజయనగరంలో కూడా పూజలు చేశారు. ఇప్పటికే 1500 ఇళ్లు, దైవ కార్యక్రమాలలో పూజలు నిర్వహించారు. వివరాలకు 8247827610, 9951680869 నంబర్లకు సంప్రదించవచ్చు.



**లక్ష కాపీలతో ప్రత్యేక పుస్తకం..**

సంఘం సభ్యులు ఇళ్లలో నిర్వహించే లలితాదేవి పూజల కోసం ప్రత్యేకంగా పుస్తకాన్ని రూపొందించారు. ఇందులో నిత్య పూజా విధానంలో ఆచరించాల్సిన పద్ధతులు వివరించారు. లక్ష కాపీలను ప్రింట్ చేయించి పంపిణీ చేశారు.

**120మందితో వాట్సాప్ గ్రూపు..**

లలితా సంఘం సభ్యులు వారికి సందేశాలు తెలియచేసుకోవడానికి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 120 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పూజ ఉంటుంది. బయటి వాళ్లు చెప్పకపోతే వారి గ్రూపు సభ్యులే ఎవరో ఒకరి ఇంట్లో పూజను ఏర్పాటు చేసుకుంటారు. కరోనా సమయంలో నిరాటంకంగా పూజా కార్యక్రమాలు కొనసాగించారు. ప్రతిఒక్కరిలో సంప్రదాయం, భక్తి పట్ల విశ్వాసం పెంచేందుకు తమ వంతుకృషి చేస్తున్నారు.

**దైవచింతన పెంచేందుకే..**



సమాజంలో మంచి జరగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తున్నాం. ఆధ్యాత్మికపరంగా మనిషిలో ఉన్న భక్తిభావాన్ని మరింతగా పెంచేందుకు మావంతు కృషి చేస్తున్నాం. మానసిక ప్రశాంతత, మేలు కలగాలనేది మా సంఘం ఆశయం. కొంతమందికి పూజ చేయాలని ఉన్నా చేసే విధానం రాక ఆగిపోతుంటారు. అలాంటి వారి ఇళ్లకు వెళ్లి మావంతు సేవ అందిస్తున్నాం.

– ఇప్పిలి భవాని, రాధామణి, పద్మజ, సంఘం సభ్యులు

## అదనపు ఎస్పీలకు వీడ్కోలు



అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్‌ను సత్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఉద్యోగోన్నతి పొందిన త్రినాథరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: బదిలీపై వెళ్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, ఇటీవల డీఎస్పీ(జిల్లా స్పెషల్‌బ్రాంచి) నుంచి అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన ఎ.త్రినాథరావులను జిల్లా పోలీసులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సమక్షంలో అధికారులకు సత్కరించి, జ్ఞాపికలు బహుకరించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కాజల్ మాట్లాడుతూ పనిచేసిన ఏడు నెలల కాలంలో ప్రతిఒక్కరూ సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, శేషాద్రినాయుడు, సీఐలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## సేవలే గుర్తింపునిస్తాయి

శ్రీకాకుళం రూరల్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరావు అన్నారు. పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన బలివాడ ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖాధికారి రాకోటి విజయకుమారి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రభాకర్ సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పంచిరెడ్డి అప్పలనాయుడు, బాణాల గాంధీ తదితరులు న్నారు.



బలివాడ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: గ్రామస్తుల మన్ననలు పొందడం అభినందనీయమని ఎంఈవో ఎస్.కృష్ణారావు అన్నారు. పెదపాడు పరిధిలో ఎస్‌జీటీగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కుమారిని శనివారం గ్రామస్తులతో కలిసి సత్కరించారు.

శ్రీకాకుళం క్రైమ్ : సుదీర్ఘకాలంలో ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణపొందిన వై.చిట్టిబాబుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జిల్లా ప్రజలకు డాక్టర్ ధర్మారావు అందించిన సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు కొనియాడారు. రిమ్స్ ఆస్పత్రిలోని ఎముకల విభాగ అధిపతిగా పనిచేసి శనివారం పదవీ విరమణ చేసిన డాక్టర్ ధర్మారావును పలువురు వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, ఆర్‌ఎంఓలు డాక్టర్ సుభాషిని, డాక్టర్ భానుప్రకాశ్, ఎముకల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ప్రసన్న కుమార్, అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సిపి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రమ శిక్షణ, విధుల పట్ల అంకితభావం ఉంటే ఏ ఉద్యోగైనా గౌరవ స్థానంలోనే ఉంటారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాయింట్ లెక్టర్ దఫేదారుగా 12 ఏళ్లు మొత్తంగా 40 ఏళ్లు రెవెన్యూ శాఖలో పనిచేసిన తలగవలస సూర్యనారాయణ శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో కలెక్టర్ కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్, కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం/ఎచ్చెర్ల క్యాంపస్: సంతవురిటి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లల శివకుమార్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. అనంతరం మధుపాంలో అనకాపల్లి భూలోక, అనకాపల్లి యర్రంనాయుడు, నల్లి సత్యం కుటుంబాలను ఓదార్చారు. కొయ్యాంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జి కోటి, భగీరథపురం పంచాయతీ వీరయ్యవలసకు చెందిన కనుగుల సత్యారావు కుటుంబాలను కూడా పరామర్శించారు. ఈయనలోపాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, ఏర్నేన ప్రకాశరావు, నల్లి తవిటినాయుడు, బాలబొమ్మ శ్రీనివాసరావు, చంద్రరావు, కోటి, ముగ్గు శ్రీను, అచ్చియ్య, మజ్జి జగదీష్, పాత్రుని రమణ, గవిరెడ్డి రవికుమార్, మీసాల భాను, దుంప ఈశ్వరరావు, కొల్లి అప్పన్న పాల్గొన్నారు.



పిల్లల శివకుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

### పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న సబ్ రిజిస్ట్రార్ వేణు

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కె.వేణు కోరారు. మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వన మహోత్సవ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, టీడీపీ నాయకులు లంక శ్యామ్, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది పాల్గొన్నారు.

### చెరువును తలపిస్తున్న రోడ్లు



వర్షపునీటితో నిండిన తోటపాలెం రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎచ్చెర్ల మండలంలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కొత్తపేట నుంచి సెగిడిపేట, ముద్దాడ ఎస్సీ కాలనీ, తోటపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు, ట్రిపుల్ ఐటీకి వెళ్లే ఎస్ఎంపురం రోడ్డు, కింతలిమిల్లు నుంచి ఎస్ఎంపురం వెళ్లే రహదారి, కుశాలపురం పంచాయతీ వెంకటాపురం రోడ్డు, కొంగరాం, ముద్దాడ రహదారులు గోతులమయంగా మారాయి. వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొత్తపేట రోడ్డు దుస్థితి

### వెంకన్నకు విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శనివారం నగరవీధులలో హరినామ సంకీర్తనలు నిర్వహించారు. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తులసిమాలలతో అలంకరించారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.



పాతశ్రీకాకుళంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి



చిన్నబజారులో తులసిమాల అలంకరణలో వేంకటేశ్వరుడు

# వదలని వాన



సరస్వతి థియేటర్ సమీపంలో పేరుకుపోయిన మురుగు

- మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం
- కాలువల్లో పూడిక తీసి రోడ్డుపై వదిలేయడంతో ఇబ్బందులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం రూరల్: నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శనివారం వేకువజామునుంచి సాయంత్రం 4గంటల వరకూ కుండపోతగా వర్షం కురవడంతో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. పాతబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ఇల్లిసిపురం, రైతుబజారు, రామలక్ష్మణ కూడలి, కూరగాయల మార్కెట్, కంపోస్ట్ కాలనీ, గుజరాతిపేట, హయాతినగరం తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే అడుగుకు పైగా నీరు ప్రవహించింది. కాలువలు పొంగిపొర్లడంతో రోడ్లపైకి మురుగు నీరు చేరి దుర్గంధభరితమవుతోంది.

**రోడ్లపైనే మురుగు..**

కొద్ది రోజులుగా మున్సిపల్ యంత్రాంగం కాలువల్లో పూడిక తీస్తున్నారు. మురుగును వెంటనే తరలించకుండా రోడ్డుపై వదిలేయడంతో అస్తవ్యస్తంగా మారుతోంది. సాధారణ దినాల్లో ఇటువంటి పరిస్థితి ఉండగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పాతబస్టాండ్ కూడలి వద్ద నిలిచిన వర్షపు నీరు



నీట మునిగిన పంట పొలాలు

**మునిగిన పంట పొలాలు..**

వర్షాల ధాటికి శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పంట పొలాలు జలమయమయ్యాయి. పెదపాడు పరిసర ప్రాంతాల్లో అపార్టుమెంట్ల చుట్టూ వర్షపునీరు చేరి చెరువులా మారింది. చాపురం, పాత్రునివలస, సింగుపురం, వప్పంగి తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీటితో నిండిపోయాయి.



పాత్రునివలస సమీపంలో పొలాల్లోకి చేరిన నీరు



చాపురంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

## చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల : సైన్స్‌పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు చెకుముకి సంబరాలు తోడ్పడతాయని లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉరిటి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో శనివారం చెకుముకి సంబరాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌లో మెలకువలను నేర్చుకోవాలన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు, జేవీవీ పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడానికి చెకుముకి సైన్స్ సంబరాలు సహాయపడతాయన్నారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న పోటీలు జరుగుతాయని చెప్పారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులంతా అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంత్రాల అనూరాధ, ఎస్.కె.ప్రసాదరావు, కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, కూన చినపెంటయ్య, సీర రమేష్ బాబు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు: కలెక్టర్



పొన్నాడలో పింఛన్లు పంపిణీ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఎందువలో చిన్నారికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/జి.సిగడాం: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. శనివారం పొన్నాడలో సామాజిక పింఛన్ల పంపిణీ పరిశీలించారు. ఎచ్చెర్ల మండలంలో 93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీ వో ఆర్.రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్ తెలిపారు. రణస్థలం, కాకిపాలెం, ఎందువ, గెడ్డకంచరాం గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్ : అరసవల్లి సచివాలయ పరిధిలోని ఓల్డ్ ఏపీహెచ్‌బీ కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు.

### సీపీఎస్ రద్దు చేయాలి

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న సీపీఎస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ లావేరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జగదీశ్వరరెడ్డి, పడి నాగభూషణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్‌సీ కోసం కమిటీని నియమించాలన్నారు. అంతవరకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 1న సీపీఎస్ వ్యతిరేక దినంగా పాటించి పాత తాలూకా కేంద్రాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.